నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, శనివారం 21 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

అనధికారికంగానే ప్రొటోకాల్ పొందింపు

ఉమ్మడి జిల్లాలో ఆయనో సీనియర్ ఎమ్మెల్యే. దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో అనుభవ శీలి. మంత్రిగా పని చేసిన అనుభవం సొంతం. మొన్నటి ఎన్నికల్లో మరోసారి గెలిచినా అమాత్య పదవి మాత్రం అందలేదు. కానీ మంత్రి హోదాను మాత్రం అనుభవిస్తున్నారు. ఆయన వేరేవరో కాదు.. కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి. నేడు, రేపు అంటూ ఉవ్విళ్లూరే కేబినెట్ విస్తరణ ప్రకటనలతో సరి పెట్టుకుంటూ మంత్రి స్థాయిలో అనధికారికంగా ప్రొటోకాల్ పొందుతున్నారు. మంత్రి కాని మంత్రిగా ఉమ్మడి జిల్లాపై పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యే హోదాలోనే సుడిగాలి పర్యటనలు చేస్తూ, అధికార యంత్రాంగానికి మార్గనిర్దేశనం చేస్తున్నారు. పక్క నియోజకవర్గాల్లోనూ పని కల్పించుకుని సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇలా మంత్రి కాకుండానే మంత్రిగా సుదర్శన్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పాలనా యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తున్నారు. కలెక్టర్లు, సీపీ, ఎస్పీ సైతం ఆయనకే జై కొడుతున్నారు. ఎమ్మెల్యేలు సైతం ఆయన వద్దకే క్యూ కడుతున్నారు. పోలీస్ శాఖ ఏకంగా కేబినెట్ ర్యాంక్ కలిగిన ప్రజాప్రతినిధికి కల్పించే భద్రతను కల్పిస్తున్నది.

–నిజామాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



మంత్రి కాని మంత్రి

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వరుస సమీక్షలు

తరచూ సుడిగాలి పర్యటనలు

పెద్దాయనకే జైకొడుతున్న పెద్ద సార్లు

జెండావిష్కరణకు మాత్రం నో చాన్స్

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు ఖాయమని తొలి నుంచీ ప్రచారం జరిగింది. కానీ పెద్దాయనకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. నేడో రేపో అంటూ మొదలైన కాలయాపన ఏకంగా నవ మాసాలు దాటిపోయింది. మంత్రి పదవి రాకపోవడంపై అసంతృప్తిగా ఉన్న సుదర్శన్‌రెడ్డి నారాజ్ కాకుండా ఉండేందుకు సీఎం కార్యాలయం ఓ ప్లాన్ వేసినట్లు తెలిసింది. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును నామమాత్రం చేసి, సుదర్శన్‌రెడ్డి విలువను పెంచేందుకు కాంగ్రెస్ అధిష్టానం కొత్త ఎత్తు గడకు తెర లేపినట్లు సమాచారం. అందులో భాగంగానే మంత్రి స్థాయిలో గౌరవ, మర్యాదలు కల్పించేలా అధికార యంత్రాంగానికి మౌఖిక ఆదేశాలను జారీ చేసినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఇన్‌చార్జి మంత్రులంతా ఇతర జిల్లాల్లో హడావుడి చేస్తుంటే ఉమ్మడి నిజామాబాద్‌లో మాత్రం స్తబ్ధుగా ఉండడానికి కారణం ఇదేనన్న చర్చ నడుస్తున్నది. మరోవైపు, మంత్రివర్గ కూర్పులో వివిధ సామాజిక సమీకరణల మూలంగా జరుగుతున్న జాప్యమే తప్ప సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖాయమైందని పీసీసీ వర్గాలు బాహాటంగానే చెబుతున్నాయి. అయితే, కాలయాపన వల్ల సుదర్శన్‌రెడ్డిలో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకే ఉమ్మడి జిల్లా పరిపాలనను ఆయన చేతిలో పెట్టినట్లు తెలిసింది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకున్నప్పటికీ మౌఖిక ఆదేశాలతో ప్రభుత్వ శాఖలపై అజమాయిషీ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు. బోధన్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లోనూ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా మరింత ఎక్కువగా దృష్టి పెట్టి పాలనాపరమైన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

జెండావిష్కరణకు నో చాన్స్

మరోవైపు, మంత్రి స్థాయిలో ప్రొటోకాల్ దక్కించుకుంటున్న సుదర్శన్‌రెడ్డికి జెండావిష్కరణకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ విప్, కార్పొరేషన్ చైర్మన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించగా, సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న వారికి మాత్రం చోటు ఇవ్వలేదు. మొన్న జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో నిజామాబాద్‌లో మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ జెండావిష్కరణ చేయగా, సెప్టెంబర్ 17న కూడా ఆయనకే మరోసారి అవకాశం దక్కింది. సుదర్శన్‌రెడ్డికి మాత్రం ఆ అవకాశం లేకుండా పోయింది. కామారెడ్డిలో జిల్లాకు సంబంధం లేని పటేల్ రమేశ్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. అయితే, మంత్రి కాని మంత్రి హోదాలో కొనసాగుతున్న సుదర్శన్‌రెడ్డికి జెండా ఆవిష్కరణ చేసే అవకాశం దక్కక పోవడంపై బోధన్ నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొన్నది.

కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

బదిలీల దుమారం..

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పోలీసుల బదిలీల వ్యవహారం అధికార పార్టీలో చిచ్చురేపింది. కేవలం సీనియర్ ఎమ్మెల్యే ఓకే చెప్పిన వ్యక్తులకే పోలీస్ ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారిని కాదనడంపై వివాదం రాజుకున్నది. ఒక దశలో ఈ వ్యవహారం పోలీస్ ఉన్నతాధికారి వర్సెస్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అన్నట్లుగా మారింది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేకు, పోలీస్ ఉన్నతాధికారికి మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం బాహాటంగానే కనిపిస్తున్నది. రైతు రుణమాఫీ విషయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీని ఎస్సై స్థాయి అధికారితో అనుమతి లేదంటూ నిలువరించడం ఉమ్మడి జిల్లాలో తీవ్ర దుమారమే రేపింది. ఈ ఇష్యూ ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి దాకా వెళ్లినట్లు తెలిసింది. కొంత మంది సీఐల బదిలీ వ్యవహారంలోనూ పోలీస్ ఉన్నతాధికారి పంతం నెగ్గించుకోవడం, సీనియర్ ఎమ్మెల్యే మాటకు ఇచ్చే మర్యాద కొత్త ఎమ్మెల్యేకు దక్కక పోవడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

పురాతన కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- అట్టహాసంగా నాగన్నబావి ప్రారంభోత్సవం

లింగంపేట, సెప్టెంబర్ 20:పురాతన కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలు అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. పునరుద్ధరణ పొందిన లింగంపేట మండల కేంద్రంలోని మనోహర్ వాటికా నాగన్న బావిని శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాగన్న బావిని అభివృద్ధి చేయడానికి సంకల్పించిన అప్పటి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కృషి అభినందనీయమన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామంలో ఉన్న త్రిలింగేశ్వర ఆలయాన్ని సైతం అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నాగన్న బావి చరిత్రను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించానని, ఆయన త్వరలోనే సందర్శిస్తారన్నారు. గుజరాత్ రాష్ట్రంలో రాణికి వావ్‌ను నాగన్న బావి పోలి ఉందన్న ఎమ్మెల్యే.. బావి చరిత్రను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రచారం పొందితేనే గుర్తింపు వస్తుందన్నారు. చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. నాగన్న బావిని పర్యాటక ప్రాంతంగా మారుస్తామన్న ఆయన.. లింగంపేట మండలాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనారమేశ్ మాట్లాడుతూ.. లింగంపేటకు చెందిన రజాక్ నాగన్న బావిపై ఆర్టికల్ రాశారని, 2020 మే మాసంలో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం ప్రచురించిందన్నారు. రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నాగన్నబావితో సహా 24 బావులు అభివృద్ధి చేశామని వివరించారు. ప్రారంభోత్సవానికి ముందు పరంపర ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శన ఆకట్టుకున్నది. అనంతరం నాగన్న బావికి భూమి విరాళంగా అందించిన భూదాత మనోహర్‌రావును కలెక్టర్ సన్మానించారు. ఎస్పీ సింధూశర్మ, బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, డీఈవో రాజు, డీఆర్‌డీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం రాత్రి నిద్రించారు. అంతకు ముందు విద్యార్థులతో కాసేపు మాట్లాడిన ఆయన.. వసతులపై ఆరా తీశారు.

– ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 20

టీఎన్జీవో అధ్యక్షుడు కిషన్ రాజీనామా

'నమస్తే' కథనాలతో దిగిపోక తప్పని పరిస్థితి

తప్పనిసరి కావడంతో తప్పుకున్న వైనం

దశాబ్ద కాలంగా సంఘంలో చక్రం తిప్పిన అలుక



ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 20: నిజామాబాద్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు అలుక కిషన్ తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని రాష్ట్ర నాయకత్వం నిర్ధారించింది. ఎన్నికలు జరిగే వరకూ అధ్యక్షుడిగా కొనసాగాలని కిషన్‌కు సూచించినట్లు తెలిపింది. టీఎన్జీవో పాలకవర్గానికి కొన్నేళ్లుగా ఎన్నికలన్నవే లేకుండా పోయాయి. ఏకగ్రీవాల పేరుతో సంవత్సరాల పాటు కొందరు ఏకఛత్రాధిపత్యంతో అంతా తామై నడిపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి పదవుల్లో కొనసాగుతున్న వైనంపై 'సీటు వదలం', 'ఢీఎన్జీవో' శీర్షికలతో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాలను ప్రచురించిన సంగతి తెలిసిందే. టీఎన్జీవోలో కొందరి గుత్తాధిపత్యం, సభ్యుల్లో నెలకొన్న అసంతృప్తిని ఎత్తిచూపింది. గెజిటెడ్ ఉద్యోగులు టీఎన్జీవోలో ఉండొద్దన్న నిబంధనను సైతం తుంగలో తొక్కి బాధ్యతలు నిర్వహించడంపై ఉద్యోగ వర్గాల్లోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. వీటన్నింటినీ ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనాలను జత చేస్తూ కొందరు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కార్యవర్గం ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించింది. మరోవైపు, టీజీవోలు.. టీఎన్జీవో బాధ్యతల నుంచి తప్పుకోవాలని ప్రభుత్వం కూడా స్పష్టం చేసింది. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసింది. ఇక చేసేదేమీ లేక తప్పనిసరి పరిస్థితుల్లో అలుక కిషన్ పదవి నుంచి తప్పుకున్నారు. దశాబ్ద కాలంగా టీఎన్జీవోలో చక్రం తిప్పిన ఆయన వైదొలిగారన్న విషయం తెలిసి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను పార్టీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

దొంగలకు దేహశుద్ధి

- కరెంట్ వైర్లు ఎత్తుకెళ్తుండగా పట్టుకున్న గ్రామస్తులు
- నవీపేట మండలం ఫత్తేపూర్‌లో ఘటన

నవీపేట, సెప్టెంబర్ 20: విద్యుత్ తీగలు దొంగిలించి పారిపోతున్న దొంగలకు గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన నవీపేట మండలం ఫత్తేపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నవీపేట మండల కేంద్రంలోని తాడ్‌గామకు చెందిన సాయిలుకు నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన పవన్‌తో కొన్నినెలల క్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ మోటర్ల వద్ద విద్యుత్ వైర్లను దొంగిలించి, వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీనిని వృత్తిగా చేసుకున్న వారు మండలంలోని ఫత్తేనగర్ గ్రామంలో గురువా రం రాత్రి విద్యుత్ తీగలను దొంగిలించి పారిపోతుండగా ..అనుమానం వచ్చి గ్రామస్తులు అడ్డుకున్నారు. చోరీ విషయం తెలియడంతో గ్రామస్తులు వారికి దేహశుద్ధి చేశారు. ఇప్పటివరకు వారు చేసిన చోరీ చేసిన వివరాలను కూడా గ్రామస్తులు రాబట్టి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక ఏఎస్సై మోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని దొంగలను అదుపులోకి తీసుకున్నారు.

మూడురోజుల క్రితం కేబుల్ వైర్ల చోరీ

మూడు రోజుల క్రితం మట్టయ్యఫారం గ్రా మంలోని బదావత్ వసంత్‌కు చెందిన మూడు జెట్ పంపుల విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకొని పారిపోయారు. దీంతోపాటు చుట్టుపక్కల రైతులకు చెందిన కేబుల్ వైర్లను కూడా ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు బదావత్ వసంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మండలంలో కొన్ని రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. చోరీలను అరిట్టేందుకు పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

పిల్లల కిడ్నాప్‌కు యత్నం

పట్టుకొని చితకబాదిన స్థానికులు

బిచ్కుంద మండల కేంద్రంలో ఘటన

బిచ్కుంద, సెప్టెంబర్ 20: పిల్లల కిడ్నాప్‌కు యత్నించిన ఇద్దరిని స్థానికులు పట్టుకుని చితకబాదారు. బిచ్కుంద మండల కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సాత్విక్, నాందేవ్ చదువుతున్నారు. స్కూల్‌లో బాత్రూంలు సరిగా లేకపోవడంతో.. ఇంటర్‌వెల్ సమయంలో బహిర్భూమికని ఇంటికి వెళ్లేందుకు బడి నుంచి బయటికి వచ్చారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ జంట.. ఎక్కడకు వెళ్తున్నారని వారితో మాట కలిపారు. వారి ప్రవర్తనను అనుమానించిన విద్యార్థులు పరుగెత్తగా వెంబడించారు. కొద్దిదూరం వెళ్లాక విద్యార్థులు అక్కడ కనిపించిన వారికి విషయం చెప్పారు. దీంతో అక్కడున్న వారంతా పొగై అనుమానితులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. పురుషుడ్ని స్తంభానికి కట్టేసి కొట్టగా, మహిళను స్త్రీలు చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. మహిళ, పురుషుడు ఓ మేస్త్రీ వద్ద పని చేస్తారని, తాగిన మైకంలో ఉన్న ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది.

కిడ్నాప్‌కు యత్నించిన మహిళను చితకబాదుతున్న స్థానికులు

అనుమానితుడిని కట్టేసిన స్థానికులు

ఆలూర్‌లో పిచ్చికుక్క దాడి

మూడేండ్ల బాలుడితోపాటు ఆరుగురికి గాయాలు

కుక్క దాడిలో గాయపడిన బాలుడు

ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్ 20: జిల్లాలో కొన్నిరోజులుగా పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మనిషి కనిపిస్తే చాలు వెంటపడి దాడి చేస్తున్నాయి. దీంతో బయటికి వెళ్లాలంటేనే జంకే పరిస్థితి నెలకొన్నది. తాజాగా ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చి కుక్క దాడిలో ఏడుగురు గాయాల పాలయ్యారు. పిచ్చి కుక్క దాడిలో మూడేండ్ల బాలుడు కావల్ల విశ్వాస్‌తోపాటు గడీల మల్లక్క, తొర్తి సావిత్రి, లింగాల రాములు, బూర్గుల మల్లాగౌడ్, ఉమ్మెడ నల్లన్న, కత్తుల మోహన్ గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అందరూ కోలుకున్నట్లు స్థానికులు తెలిపారు. దాడిచేసిన కుక్కను గ్రామ శివారులో వదిలేసినట్లు చెప్పారు.

గైర్హాజరైన సిబ్బందికి మెమోలు ఇవ్వండి

- డీఎంహెచ్‌వోకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం
- ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం తనిఖీ

ఇందల్వాయి, సెప్టెంబర్ 20 : ముందస్తు అనుమతి, సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన వైద్యసిబ్బందికి మెమోలు జారీ చేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వోతో కలిసి తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించారు. ల్యాబ్‌లో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని టెక్నీషియన్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓపీ, ఇన్‌పేషంట్ వార్డులను సందర్శించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. హాజరు పట్టికను తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన సిబ్బందికి మెమోలు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఔషధాలను శీతలీకరణలో ఉంచేందుకు ఉపయోగించే ఫ్రిడ్జ్‌లను వినియోగించకుండా వృథాగా మూలాన పడేయడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పాడైపోతే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో ఫ్రిడ్జ్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను పరిశీలిస్తూ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు